క్లుప్తంగా

విద్యార్థుల శ్రమదానం


ఇప్పలపాడు సమీపంలో రోడ్డు మార్జిన్‌ను బాగు చేస్తున్న విద్యార్థులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలోని ఐటీడీఏ, ఏకలవ్య పాఠశాలలకు వెళ్లే రెండు రోడ్ల మార్జిన్ ఇటీవల వర్షానికి దెబ్బతింది. దీంతో ఈ మార్గంలో వాహనదారులు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. సోమవారం ఐటీఐ కళాశాల విద్యార్థులు శ్రమదానం చేసి పాడైపోయిన రోడ్డు మార్జిన్‌ను బాగుచేసుకున్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు


సభ్యత్వం నమోదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

లింగపాలెం: క్రమ పద్ధతిలేని సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ముప్పిడి సామ్యూల్ అన్నారు. లింగపాలెం మండలంలో టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) మండల అధ్యక్షుడు సొంగా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏలూరు జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శామ్యూల్ ధర్మాజీగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌తో మాట్లాడుతూ క్రమ పద్ధతిలేని పని సర్దుబాటు లోపభూయిష్టంగా ఉందని తక్షణం సరిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

గూటాలలో డీఎస్పీ పల్లెనిద్ర


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామంలో డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. పలు పార్టీల నాయకులతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై వారికి పోలీసులపై నమ్మకం పెంచారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడూ ఏ విధమైన సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ బాల సురేష్‌బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పూర్తిచేయండి


ఎంపీడీవో జి.శ్రీనుకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఇటికలకోట గ్రామంలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం పోలవరం మండల నాయకులు ఎంపీడీవో జి.శ్రీనుకు వినతిపత్రం సమర్పించారు. 2005వ సంవత్సరంలో అప్పటి ఎంపీ కమ్యూనిటీ హాలు భవనానికి నిధులు మంజూరు చేశారన్నారు. అయితే ఆ భవన నిర్మాణం మధ్యలో ఆగిపోయిందన్నారు. ఆ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొరగం చంద్రరావు, కొమరం పోశీరత్నం, సముద్రాల సాయికృష్ణ, కొప్పుల వీరాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు


కొత్తపట్టిసీమ ఆర్అండ్‌బీ రహదారిపై తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం నుంచి గూటాల గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను తొలగించే పనులను కొత్తపట్టిసీమ గ్రామపంచాయతీ చేపట్టింది. పంచాయతీ పరిధిలోని ఇసుక ర్యాంపు సమీపంలో మలుపు వద్ద పెద్దెత్తున తుప్పలు, చెట్లు పెరిగిపోయి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం ఏటిగట్టు రోడ్డుపై ఉన్న తుప్పలను జేసీబీ, కూలీలతో తొలగించి శుభ్రం చేయించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కొయ్యలగూడెం: రాజవరంలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం


కుక్కునూరు: సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది


వేలేరుపాడు: కన్నాయిగుట్టలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం

కొయ్యలగూడెం: పోషకాహార మసోత్సవ కార్యక్రమం రాజవరం గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ శాఖ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఈ.తులసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. చీర, సారె, పసుపు, కుంకుమలను గర్భిణులకు అందజేశారు. బాలింత స్త్రీలు పోషకాహార పదార్థాలను తీసుకోవడం వలన తల్లి బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను ప్రజాప్రతినిధుల చేత ప్రారంభింపజేశారు. పొంగుటూరు ప్రాజెక్టు సెక్టార్ పరిధిలోని కార్యకర్తలు డి.లీలాకుమారి, ఎం.నాగదేవి, సీహెచ్ వసంతరాణి, కె.కృష్ణవేణి, కె.జయమణి, ఎస్.అంజలి, ఎం.మాధవి, వై.రాజీరత్నం, కె.జయమణి, కె.సత్యవతి, ఎస్.విజయకుమారి, పి.భాగ్య, ఎ.వెంకటలక్ష్మి, కె.కాశీపద్మ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్‌తో కూడిన ఆహారం తీసుకోవాలి

కుక్కునూరు: గర్భిణులు ఐరన్‌తో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రుక్మిణి పేర్కొన్నారు. సోమవారం గణపవరం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. అనంతరం పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలనే విషయమై గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో గణపవరం సర్పంచ్ తుర్సం నరేష్, ఎల్లంకి లక్ష్మణ్‌రావు, గాడిది రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుభద్ర, జానకి, సుజాత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు: మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిరుధాన్యాలతో స్టాల్స్ నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు జరిపారు. సర్పంచ్ విజయ, నాయకులు త్రిమూర్తులు, కారం దారయ్య తదితరులు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భారతి, గర్భిణులు, తల్లులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, కిషోర బాలికలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు రాహుల్


పోటీలకు ఎంపికైన వై.రాహుల్

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు తమ కళాశాలలోని సెకండ్ ఇయర్ ఎంపీసీ విద్యార్థి వై.రాహుల్ ఎంపికైనట్లు వీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి సోమవారం పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీన పెదవేగిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన రాహుల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌ను పలువురు అభినందించారు.

పరామర్శ


గొల్లగూడెంలో గంగరాజుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం గొల్లగూడెంకు చెందిన సోదెం గంగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గంగరాజు కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా గంగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐ, ఏఎంవీఐల బదిలీ

జంగారెడ్డిగూడెం: స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వీఎల్ ప్రవీణ బదిలీ అయ్యారు. వీరిని కొవ్వూరు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా ఇక్కడకు రాజమండ్రి నుంచి ఎస్ఎస్ రంగనాయకులు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై రానున్నారు. అలాగే జంగారెడ్డిగూడెం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం.రాజు బదిలీ అయ్యారు. ఈయన కాకినాడ జిల్లా డ్వామా పీడీగా బదిలీకాగా, కాకినాడ జిల్లా డ్వామా పీడీగా పనిచేస్తున్న ఎ.వెంకటలక్ష్మి జంగారెడ్డిగూడెం డివిజన్ డీఎల్‌డీవోగా బదిలీపై రానున్నారు.

పిడుగు పడి విద్యుత్ ఇన్సులేటర్లు దగ్ధం

వేలేరుపాడు: మండలంలోని బండలబోరు భూదేవిపేట మధ్యలో 33 కేవీ విద్యుత్ లైన్ ఇన్సులేటర్లు ఆదివారం రాత్రి పడిన పిడుగుకు దగ్ధమయ్యాయి. ఈ లైన్‌లో మొత్తం 13 ఇన్సులేటర్లు కాలిపోయాయి. దీంతో ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మన్యంలో దంచికొట్టిన వాన

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం మన్యంలోని గిరిజన గ్రామాల్లో వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండగానే ఉన్నప్పటికీ మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక్కసారిగా మబ్బులు కమ్మి వర్షం దంచికొట్టింది. గత మూడు రోజులుగా ఈ ప్రాంతంలో ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తూనే ఉంది. శనివారం 37.2 మిల్లీ మీటర్ల వర్షం కురవగా ఆదివారం 7.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్ కె.స్లీవజోజికి వినతిపత్రం అందజేస్తున్న అంబేద్కర్ అభ్యుదయ కమిటీ నాయకులు

జంగారెడ్డిగూడెం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా వ్యవహరించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ అభ్యుదయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కె.స్లీవజోజికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఫ్లెక్సీని అవమానీయంగా తొలగిస్తూ దళితుల మనోభావాలను దెబ్బతీసేలా రఘురామకృష్ణంరాజు వ్యవహరించారని, వెంటనే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కె.సుందరరావు, కె.నవీన్, కె.సత్యనారాయణ కె.వెంకటేశ్వరరావు, దళిత సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి

చింతలపూడి: రాజ్యాంగ నిర్మాత డా బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఏలూరు- చింతలపూడి ప్రధాన రహదారిపై ధర్నా చేసి రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు కలకుర్తి నాగేశ్వరరావు, కాకర్ల సత్యన్నారాయణ, బుచ్చిబాబు తదితరులు మాట్లాడుతూ రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీఎం చంద్రబాబు తక్షణం రఘురామకృష్ణంరాజును టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. కాళ్ల మండలం, ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు దళితుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. ఎమ్మెల్యే పదవికి రఘురామకృష్ణంరాజు అనర్హుడని విమర్శించారు. తక్షణం ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనుల ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని హిందూ శ్మశానవాటికను అప్‌లాండ్ క్షత్రియసేవా సమితి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. సోమవారం హిందూ శ్మశానవాటిక సుందరీకరణ పనులను చైర్‌పర్సన్ ప్రారంభించారు. సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి, నిర్వహణకు మాత్రమే సమితి నిధులు వెచ్చించనున్నట్లు చెప్పారు. దహన ఖర్చులు, కైలాస రథం వంటి సేవలు నిర్ణీత రుసుముతో అందించడం జరుగుతుందన్నారు. శ్మశానవాటిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలనుకునే వారు వారి ద్రవ్య సహాయాన్ని సేవా సమితి సభ్యులకు అందజేయాలని కోరారు. ప్రతి నెలా ఆదాయ వ్యయాలను పూర్తి వివరాలతో మున్సిపల్ కౌన్సిల్‌కు సమర్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, పట్టణ నాయకులు బత్తిన చిన్న, కంచర్ల విష్ణు, క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు, సభ్యులు వేగేశ్న సత్యనారాయణరాజు, ఇసుకపల్లి శ్రీనివాస్‌రాజు, ఇన్సూరెన్స్ విశ్వనాధరాజు, నాగరాజు, వేగేశ్న రామరాజు, జోగి నరసింహరాజు, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి గంగానమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు


జంగారెడ్డిగూడెం గ్రామదేవత దసరా శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామదేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం ఆలయం వద్ద దసరా శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన కరపత్రాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 3వ తేదీ అమ్మవారిని శ్రీబాలా త్రిపుర సుందరి దేవి, 4న గాయత్రిదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితా త్రిపుర సుందరీ దేవి, 7న మహాచండీ దేవి, 8న శ్రీమహాలక్ష్మీదేవి, 9న సరస్వతి దేవి, 10న దుర్గాదేవి, 11న మహార్నవమిని పురస్కరించుకుని ఉదయం మహిషాసుర మర్దిని దేవిగా, సాయంత్రం మహాకాళీదేవిగా, 12వ తేదీన శ్రీరాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు గంగానమ్మ దర్శనమిస్తారని తెలిపారు. 12వతేదీ శమీపూజ, 13న చండీహోమం, తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. 14వ తేదీన అమ్మవారి గ్రామోత్సవం, 16న అమ్మవారి లడ్డూ ప్రసాద వేలం, అనంతరం 11 గంటల నుంచి మహాన్నసమారాధన, 17న అమ్మవారి శేషవస్త్రాల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం ఆలయం వద్ద వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి దసరా శర్నన వరాత్రుల ఆహ్వాన కరపత్రాలను సోమవారం బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆలయ నిర్మాణకర్తలు బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శశికుమార్ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించగా, ఆలయ విశిష్టతను కె.విజయశర్మ వివరించారు. ఆధ్యాత్మికవేత్త దసరా మహోత్సవాలు నిర్వహణ తీరును వివరించారు. కార్యక్రమంలో బవిరిశెట్టి నాగేశ్వరరావు, సత్యనారాయణ, కొత్తగుండ శ్రీనివాస్, రొక్కం ఆదినారాయణరావు, నారాయణరావు, రాములు అమ్మవారిని దర్శించుకున్నారు.

'మీకోసం'కు 13 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మీకోసం కార్యక్రమానికి 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. అర్జీల పరిష్కారం సంతృప్తికర స్థాయిలో ఉండాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. యూటీఏ కళాకారుల సంఘానికి 200 గజాల రెసిడెన్సీ భవనం ఇప్పించాలని కోరుతూ యూటీఏ సభ్యులు ఏకే రాజు, మరికొందరు వినతిపత్రం అందజేశారు. ఎల్‌పీజీ హెపీ గ్యాస్ వినియోగదారుల వద్ద నుంచి గ్యాస్ సరఫరా బిల్లు కంటే అదనంగా రూ. 50 వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెంకు చెందిన బొడ్డు రాంబాబు కోరారు. తన కుమారుడు పేరు సాయి శ్రీ సత్యప్రకాష్ బదులుగా సత్యశ్రీధర్‌గా స్కూల్ రిజిస్టర్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని రాజవరం గ్రామానికి చెందిన కాశిన రామకృష్ణ వినతిపత్రం అందించారు. ఇంకా మరణ ధృవీకరణపత్రం కోసం, భూసంబంధిత సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు అందాయి. కార్యాలయంలో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బర్లమడుగులో సారా విక్రేత అరెస్ట్


సారా కలిగిన వ్యక్తితో కుక్కునూరు పోలీసులు

కుక్కునూరు: సారా కలిగియున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రామక్రిష్ణ చెప్పిన వివరాలివి. బర్లమడుగు గ్రామానికి చెందిన సొందె దుర్గయ్య అనే వ్యక్తి 25 లీటర్ల సారా కలిగియున్నాడన్న సమాచారం మేరకు సోమవారం పోలీసులు తనిఖీ చేశారు. దుర్గయ్య వద్ద సారా స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వ్యక్తిపై దాడి..

లింగపాలెం: పాత కక్షలు పురస్కరించుకొని జరిగిన దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం ముడిచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముడిచర్ల గ్రామానికి చెందిన గొల్ల శ్రీను వరి పొలంలో గడ్డి కోస్తుండగా, ఇదే గ్రామానికి చెందిన బి.ప్రసాద్ అనే వ్యక్తి కర్రతో కొట్టి గాయపరిచాడు. పొలంలో గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనును కుటుంబ సభ్యులు 108లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హాస్పిటల్లో ఎమ్మెల్సీ రిపోర్టును నమోదు చేశారు. శ్రీను తల్లి అన్నదమ్ములు దుర్గా, భాస్కరరావు, చంద్రి ఈ ఘటనపై ధర్మాజీగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు


పోలవరం పీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యబృందం సభ్యులు పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. 50 మంది కార్మికుల వరకు ఈ శిబిరంలో వైద్యసేవలు పొందారు. డీఎల్‌పీవో మహ్మద్ రజావుల్లా, వైద్యులు టి.కృష్ణంరాజు, బీఎన్ సునీల్‌కుమార్, కె.అరుణశ్రీ, ఎన్.హేమంత్ కుమార్, కె.ప్రశాంత్, జి.జ్యోతి, పీబీ విష్ణువర్ధిని, సాయి గణేష్ పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థుల సమస్యలపై వినతి


జేసీ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం మాధవరం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేసీ ధాత్రి రెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఆశ్రమ పాఠశాల హాస్టల్స్ మెరుగుపడాలంటే విద్యార్థులు తమ జీవితాలు త్యాగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. గతంలో పోలవరం నియోజకవర్గంలో ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కావాలంటే విద్యార్థులు ప్రాణత్యాగాలు చేస్తేనే వచ్చేవని గుర్తు చేశారు. తక్షణం కుక్కునూరు మండలంలోని ఆశ్రమ పాఠశాల హాస్టల్స్‌లో కనీస సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాల ఒక చోట వసతి గృహం ఇంకోచోట ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఇ.పవన్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన పి.ప్రభాకర్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


పోలవరం పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్‌లు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో కొవ్వాడ కాలువ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను సోమవారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా కొవ్వాడ కాలువలో ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు.

స్కూల్ శానిటేషన్ వర్కర్ల ధర్నా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్లకు చెల్లించాల్సిన బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు పరిసర మండలాలకు చెందిన స్కూల్ శానిటేషన్ వర్కర్స్ ఏలూరులోని డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్స్‌కు రావాల్సిన ఐదు నెలల బకాయి జీతాల కోసం ఈ నెల రెండో తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తమ ఆందోళనతో మూడు నెలల జీతాలు విడుదలకు ప్రభుత్వం జీఓ విడుదల చేసినప్పటికీ బడ్జెట్ రాలేదనే పేరుతో నేటికీ జీతాలు ఇవ్వలేదని తెలిపారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.దుర్గ, కె.విజయలక్ష్మి మాట్లాడారు. అనంతరం జిల్లా విద్యాశాఖ ఏడీలు అవధాని, షరీఫ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మూడు నెలల జీతాలు విడుదల చేస్తున్నామని, ఈ మొత్తం స్కూలు స్వీపర్ల అకౌంట్లలో పడతాయని తెలిపారు.

గురు గీతారాజ్ కర్కేరాకు అవార్డు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నాట్య కళారత్న గురు గీతారాజ్ కర్కేరాను 2024వ సంవత్సరపు కేవీఎస్ ఎక్స్‌లెన్స్ పురస్కారానికి ఎంపిక చేశామని నగరానికి చెందిన కళారత్న కేవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తన జన్మదినం సందర్భంగా ఈ ఏడాది 18వ పురస్కారాన్ని ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో గీతారాజ్ కర్కేరాకు పురస్కార ప్రదాన కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. హిందూ యువజన సంఘం ఉపాధ్యక్షులు కేకే గుప్తా, ఇరదల ముద్దుకృష్ణ, వేణుగోపాల్ లునాని, వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు వసంత మహల్ సెంటర్ వెంకట్రామా ప్రెస్ రోడ్డులోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో ఈ నెల 26 నుంచి కంప్యూటర్ శిక్షణ ప్రారంభించనున్నట్టు కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ట్రిపు, డీసీఏ, డీపీపీ లోనూ, కామర్స్‌తో ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి టాలీ లోనూ శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు.